# పెగ్ నెంబర్ త్రీ



ముందు హైద్రాబాద్ తరువాత– విజయవాడ– పోలీసులతో పేచీపడ్డాక కాలనీ వాళ్ళందరం కలిసి ఒక మీటింగ్ ఏర్పాటు చేసి ఇక నుంచీ ఎవ్వరం రాజకీయాల జోలికీ, పోలీస్‌లతో పేచీ వచ్చే వ్యవహారాల జోలికీ పోకూడదని నిర్ణయించుకున్నాం.

"నేనొప్పుకోను!" ఎదురు తిరిగాడు శాయిరామ్ "మనం వాటి జోలికి వెళ్ళకపోయినా అవే మన కాలనీ లైఫ్‌లోకి జొరబడుతూంటే మనమేం చేస్తాం? గాజులు తొడుక్కుని కూర్చుంటామా?" అన్నాడు ఆవేశంగా.

"కూర్చోకపోతే జైలుకు పోతారు! లేదా మనవాళ్ళందరినీ శ్రీకాకుళం ప్రాంతానికి బదిలీ చేసి పారేస్తారు. అదీ కాకపోతే రోడ్లు విశాలం చేసే స్కీమ్స్‌లో మన కాలనీ కూల్చి

పారేస్తారు" అంటూ బెదిరించాడు గోపాల్రావ్.

ఇళ్ళు కూల్చడం అనగానే శాయిరామ్ భయపడిపోయాడు. హైద్రాబాద్‌లో ఇళ్ళు దొరకటం ఎంత కష్టమో, ఇళ్ళ అద్దెలు ఎంత భయంకరంగా ఉన్నాయో– ఆ మధ్య వాళ్ళ బంధువుల కోసం ఇల్లు వెదికినప్పుడు అనుభవమయింది మా అందరికీ.

"సరే! మీరు చెప్పిందే కరెక్ట్" అన్నాడు రాజీకొస్తూ.

అదే అవకాశమని నేను మరో క్లాజ్ కూడా అప్పుడే ప్రవేశపెట్టాను.

"కొన్ని వారాల వరకూ కాలనీ మీటింగ్‌లు కూడా ఉండటానిక వీల్లేదు" అన్నాను శాయిరామ్ వంక చూస్తూ.

శాయిరామ్ బాధలో విలవిలలాడిపోయాడు.

"అదేమిటి? మీటింగ్‌లు ఎందుకు పెట్టకూడదు?" అన్నాడు ఉక్రోషంగా.

"నువ్వు పెట్టే మీటింగ్‌ల వల్లే గొడవలు జరుగుతున్నయ్–" అని సపోర్ట్ కోసం మిగతావారివేపు చూశాను.

"అవ్! నో మీటింగ్స్" అన్నాడు వివిన్‌పాల్.

"అవును మీటింగ్ లొద్దు!" అన్నారు రాజేశ్వరి, పార్వతీదేవిలు.

దాంతో శాయిరామ్ ఇంక మాట్లాడలేకపోయాడు.

ఆ రోజు రాత్రి చాలా హాయిగా, ప్రశాంతంగా నిద్రపోయారు కాలనీలో వాళ్ళందరూ. ఉదయం ఎనిమిదిగంటలయినా చాలామంది నిద్రపోతూనే వున్నారు. నిజంగా ఆ ఒక్కరోజు కాలనీ చరిత్రలో "స్వర్ణయుగం" అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

నా మటుకు నేను అంత ఎక్కువ ఆనందం కాలనీలోకొచ్చాక ఏనాడూ అనుభవించలేదు.

రెండోరోజు కూడా ఆ తీయని నిద్రలో మునిగితేలుతూంటే– తలుపు కొట్టిన చప్పుడయింది.

భయంగా లేచి కూర్చుని టైమ్‌పీస్ వైపు చూశాను. రాత్రి పన్నెండవుతోందప్పుడే!

ఇంత రాత్రివేళ ఎవరు పిలుస్తున్నారో అర్థం కాలేదు.

లేచి తలుపు తీయబోయేసరికి మా శ్రీమతి కూడా లేచి కూర్చుని "వద్దు! తీయకండి!" అంది గాబరాగా.

"ఎందుకని?"

"వచ్చింది దొంగలేమో– తలుపు తీశాక తీరా మీకేమయినా అయితే– నా సంగతేమిటి? అందుకే మీ ఇన్సూరెన్స్ మొత్తం కొంచెం పెంచమని మొత్తుకుంటుంటే వినిపించుకోరు–" అంది గొణుగుతూ.

దానికి నామీదకంటె నా ఇన్సూరెన్స్ పాలసీ మీద ప్రేమ ఎక్కువవటం చూసి నాకు

వళ్ళు మండిపోయింది గానీ అది దానొక్కదాని తప్పుకాదు. కాలనీలో ఆడాళ్ళందరూ ఈ మధ్య మగాళ్ళను ఇన్సూరెన్స్ మొత్తం పెంచమని గొడవ చేస్తూనే ఉన్నారు. ఆ రోజుల్లో దొంగలు మా కాలనీకి బయట ఉన్న ఓ డాబా ఇంటతనని చంపిన దగ్గర్నుంచీ వాళ్ళకా ఆలోచన కలిగింది. అతని ఇన్సూరెన్స్ పాలసీ చాలా చిన్న మొత్తం అవటం వల్ల అతని కుటుంబం చాలా అవస్తలు పడటం గమనించారుట!

"ఎవరు?" అంటూ అరచాను తలపు దగ్గర చెవిపెట్టి.

"ఎవరా? ఎవరేమిషి గురూ! నేనే జనార్ధన్ని..." అంటూ జనార్ధన్ గొంతు వినిపించాక ధైర్యంగా తలుపు తెరచాను.

బ్రాందీ వాసన గుప్పుమంటూ జొరబడింది లోపలకు.

"ఏమిటింత రాత్రప్పుడు వచ్చావ్?" అడిగాను ఆశ్చర్యంగా.

జనార్ధన్ కంటి వెంబడి కన్నీళ్ళు రాలిపోయినయ్ ''గురూ! నన్ను ష....ష...మించుగురూ." అంటూ నా చేతులు పట్టుకున్నాడు.

నా కతనిమాటలు అర్ధం కాలేదు "ఏమిటి? నేనేం చేయాలి?"

"నన్ను షమించాలి గురూ! ముందు 'ష' అను?" అన్నాడు కన్నీళ్ళు తుడిచేసుకుని.

'ష' అన్నాన్నేను.

''మిం-''

''మిం-''

''చు-''

''చు-''

"ష..మిం..చు"

"ష..మిం...చు"

"అది- అదే గురూ! నన్ను షమించానని చెప్పు!"

"ఎందుకు? నువ్వేం చేశావని?"

జనార్ధన్ గుండెలు కొట్టుకోసాగాడు. "అమ్మో- అమ్మో- ఏం చేశానేమిషి గురూ- దోహం షేశాను."

"షారీ! దోహం కాదు దో...దో- ద్రోహం- ద్రోహం షేషాను గురూ! నీకు తీరని ద్రోహం షేశాను-"

"ఏం చేశావ్?"

"ముందు షమించానను-ష...మిం...చా అను గురూ"

మా ఆవిడకు జనార్ధన్ గొడవ అర్థం అయినట్లు లేదు. "ఏమిటిలా ఏడుస్తున్నాడు?" వాళ్ళ వాళ్ళెవరికయినా సీరియస్‌గా ఉందేమో?"

"ష్" అన్నాన్నేను "అదేం కాదులే మందు కొట్టేసి వచ్చాడు."

మా ఆవిడ అదిరిపడింది "అమ్మో మందే-"

తాగి ఉన్నాడితో వాదన అనవసరం అన్న విషయం మాకు పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా బాగా అనుభవమయింది. అంచేత రాజీకొచ్చేయడానికి ప్రయత్నించాను.

"సరే బ్రదరూ! క్షమించాన్లే- ఇంక ఇంటికెళ్ళిపో-" అన్నాను, నా నిద్ర పాడయిపోతున్న విషయం గుర్తుకొచ్చి.

"నో-" గట్టిగా అరచాడు జనార్ధన్ "నేనొప్పుకోను!"

ఆ అరుపుకి మా పిల్లలూ, పక్కింటివాళ్ళూ లేచివచ్చి నిలబడ్డారక్కడ.

"ఎందుకని వప్పుకోవు? ఆశ్చర్యంగా అడిగాను.

"నేనేం దో-దో- ద్రోహం షేషానో తెలీకుండా నన్నెలా షమిస్తావ్! అలా ఊరికే షమించేయటం నాకిష్టం లేదు- షమించే వాడెవడయినా సరే రీజన్ తెల్సుకోవాలి!"

"సరే- నాకేం ద్రోహం చేశావో చెప్పు త్వరగా!"

"నైన్‌టీన్ ఎయిష్టీటూలో సిగరెట్ ఫామిన్ వచ్చింది గుర్తుందా!"

"సిగరెట్ ఫామినా?"

"అవును- సిగిరెట్ ఫామిన్!అంటే సిగిరెష్ కరువు- అప్పుడప్పుడూ మనదేశంలో సిగిరెష్ కరువు రాదూ?"

"అదా- వస్తుంది- వస్తుంది!"

"ఆ సిగరెష్ ఫామిన్ నైన్టీన్ ఎయిష్టీ షూలో వచ్చినప్పుడు- నువ్‌నన్ను కోఠీ బష్‌ష్టాప్‌లో సిగిరెష్ అడిగావు గుర్తుందా?"

"అడిగానేమో- నాకు గుర్తులేదు-"

"గుర్తు లేకపోతే గుర్తు తెచ్చుకోవాలి!"

"సరే అడిగాను!"

"అప్పుడు నేనేం షెప్పాను?"

"ఏమో గుర్తులే.."

"నో! గుర్తు తెచ్చుకోవాలి!"

"సిగిరెట్ ఇచ్చావ్."

"అబద్దం! నేనివ్వలేదు-"

"ఆ గుర్తుకొచ్చింది- ఇవ్వలేదు!" అన్నాను అబద్ధమాడేస్తూ.

"ఇవ్వకుండా ఏం షెప్పాను?"

"సిగిరెట్లు లేవని చెప్పి ఉంటావ్-"

"షెప్పి ఉంటావ్ కాదహ! అదే షెప్పాను!"

"అవును! అదే చెప్పావ్–"

హఠాత్తుగా జనార్ధన్ కిందకూర్చుని నెత్తిన రెండు చేతులూ పెట్టుకుని ఏడ్చేశాడు.

"అక్కడే నీకు దో–దో ద్రోహం అయిపోయింది గురువా. నా జేబులో అప్పుడు రెండు సిగిరెష్లు ఉన్నాయ్– అయినా లేవని అబద్ధం షెప్పాను–"

"అదా– ఏం ఫర్లేదులే! అందులో పెద్ద ఇదేముంది?" నవ్వేస్తూ అన్నాను పైకి కానీ లోలోపల వాడు అలా అబద్ధం చెప్పినందుకు వళ్ళు మండిపోయింది.

జనార్ధన్ కోపంగా లేచి నిబడ్డాడు.

"అలా మాట్లాడకు గురువా! ఏం ఫర్లేదులే అంషావేంషి?అది ద్రోహం కదూ!"

"అవును ద్రోహమే–"

"అయితే షెప్పు– ఆ రోజు నేను షేషినో దో– దో– ద్రోహానికి షమించానని షెప్పు–"

"సరే క్షమించాను!"

జనార్ధన్ మొఖంలో సంతృప్తి. హఠాత్తుగా అతని చూపు మా మిసెస్ మీద పడింది.

"నువ్ షమిస్తే షరిపోయిందేమిషి? మా వదినమ్మ షమించొద్దూ?"

మా ఆవిడ ఉలిక్కిపడింది. "నేనా? నేనెందుకు క్షమించటం?"

"నువ్ కూడా క్షమించానని చెప్పెయ్యవే! గొడవెందుకు?" అన్నాను మా ఆవిడతో రహస్యంగా.

"నేనూ క్షమించాన్లెండి!" అందామె. అబ్బ! ఈ మగసన్యాసులు తాగితే ఇంత సాధు జంతువులుగా కూడా మారే అవకాశం ఉందన్నమాట" అంది నాతో రహస్యంగా,

"ఇంక వెళ్ళిరా! మా మిసెస్ కూడా క్షమించింది కదా!" అన్నాను చిరాకు కనిపించకుండా!

జనార్ధన్ వెళ్ళబోయి– ఆగి– మా వెనుక నిలబడ్డ పిల్లల వేపు చూశాడు.

"మరి ఆళ్ళు షమించొద్దూ?"

"వాళ్ళు కూడా క్షమించార్లే!" అన్నాన్నేను.

"ఏదీ వాళ్ళు మాట్లాడందే?"

"రాత్రిళ్ళు వాళ్ళు మాట్లాడరు."

జనార్ధన్ వాళ్ళదగ్గరకెళ్ళి కింద కూర్చున్నాడు.

"పీపీ" అన్నాడు వాళ్ళ బుగ్గల మీద చిటికె వేస్తూ.

వాళ్ళు భయంగా మావేపు చూశారు "లీలీ"...వాళ్ళు రెండడుగులు వెనక్కు వేశారు.

"కీకీ" అన్నాడు మళ్ళీ– నేను కల్పించుకోకపోతే ఆ కార్యక్రమం తెల్లారేవరకూ సాగేట్లు కనిపించింది.

"ఇంక ఇంటికెళ్ళు– టైమ్ ఒంటిగంటవుతోంది" అన్నాను విసుగ్గా.

జనార్ధన్ లేచి నిలబడ్డాడు. వెనక్కు తిరిగి రెండడుగులు వేసి మళ్ళీ తిరిగి వచ్చాడు.

"మరి రంగారెడ్డి మాటేమిటి? ఆడు షమించొద్దూ?" అదిరిపడ్డాను.

"అదేమిటి? రంగారెడ్డెందుకు క్షమించటం?"

"ఆడిక్కూడా దో- ద్రోహం చేషాను. ఆడు కూడా షమిస్తే గానీ వెళ్ళను- అన్నాడు మళ్ళీ కూర్చుంటూ. చేసేది లేక నేనే వెళ్ళి రంగారెడ్డిని నిద్రలేపుకొచ్చాను.

రంగారెడ్డిని చూస్తూనే దభేల్మని అతని కాళ్ళమీద పడిపోయాడు జనార్ధన్.

"నీకు ద్రోహం షేషాను గురూ- దో- దో- హం దోదోహం- ద్రోహం!"

"నాకేం చేయలేదులే- పద- మీ ఇంటికెళ్దాం!" అన్నాడు రంగారెడ్డి.

హఠాత్తుగా గట్టిగా ఏడవటం మొదలుపెట్టాడతను. దాంతో అందరిళ్ళల్లో టపటట లైట్లు వెలిగిపోయినయ్. ఆ తరువాత ఒక్కరొక్కరేవచ్చి మూగిపోయారక్కడ. మరి కాసేపట్లో పెద్దలూ, పిల్లలూ అంతా కిటకిటలాడిపోయారు.

"నేను నీకు ద్రోహం షేషాను గురూ! నీకు తెలీదది-"

"ఏమిటది?"

"నాలుగేళ్ళక్రితం రేడియోలో జనరంజనిలో శ్రోతలు కోరిన రికార్డుల్లో- ఒక బూతుపాట కోరి- అది కోరినవారు రంగారెడ్డి నిర్భయ్నగర్ కాలనీ అని నేనే రాశాను."

"ఆ.. నువ్వా ఆ పని చేసింది?" కోపంగా అన్నాడు రెడ్డి.

"అవును గురూ! నేనే- నేను టీవీలో వేషం కోపం ఆ ప్రొడ్యూసర్ని బార్కి తీసుకెళ్ళటానికి రెండొందలు అప్పు అడిగితే లేదన్నావని కోపం వచ్చి ఆ పని షేషాను-"

అందుకని షమించాల్సిందే అని, మళ్ళీ భోరున ఏడ్వటం మొదలుపెట్టాడు.

అందరం రెడ్డిని బ్రతిమాలాము. "ముందు వాడిని క్షమించేసేయ్- లేకపోతే ఎవ్వరికీ నిద్ర ఉండదు- తెల్లార్లు న్యూసెన్స్ చేస్తాడు"

"సరే- క్షమించాన్లే" అన్నాడు రెడ్డి. "ఇంక మీ ఇంటికి వెళ్ళువుగాని పద-"

"మరి..రాజేశ్వరి షమించొద్దూ?"

అందరం ఉలిక్కిపడ్డాము "రాజేశ్వరా?"

"అవును- రాజేష్యరిక్కూడా ద్రోహం షేషాను."

"నాకేం ద్రోహం చేసిన గుర్తులేదే-" అంది రాజేశ్వరి ఆశ్చర్యంగా.

"నైన్టీన్ ఎయిషీ షూలో మీరాసిన కథ 'జ్యోతిలో' పడింది గుర్తుంషా?"

"అదెందుకు గుర్తుండదు?" ఉత్సాహంగా అందామె "అందులోనే హీరో శివశంకర్ వాళ్ళ పిన్ని కూతుర్ని మర్డర్ చేస్తారెవరో! ఎవరో ఎవరికి తెలీదన్నమాట! ఆఖరికి ఆ అమ్మాయికి కూడా తెలీదు- శివశంకర్కి ఎనిమిదిమంది మీద అనుమానం ఉంటుందన్నమాట! మొదటి అనుమానితుడు భీమ్రాజ్! క్లూ కోసం అర్ధరాత్రి రెండింటికి

భీమ్‌రాజ్ ఇంటికెల్తాడతను. లోపలకు జొరబడి గోడ పక్కన నిలబడతాడు.

"షాప్–" అంటూ ఓ కత్తి అతని పక్కనుంచీ రూసుకుపోతుంది.

"షాప్ షాప్ షాప్" అన్నీ కత్తులే!..... .... పిల్లలూ– ఆడాళ్ళు శ్రద్ధగా ఆ కథ వినటం చూసేసరికి మా అందరికి వళ్ళు మండిపోయింది.

"స్టాపిట్!" అరచాడు రంగారెడ్డి.

రాజేశ్వరి భయపడిపోయిందాకేకకు.

"మీ కథ రేపు చెప్దురు గాని– ముందితనిని డిస్పోజ్ చేయనీండి!"

"ఆ కథ పరమషెత్త కథ అనీ అలాంటి షెత్తజ్యోతిలో ప్రచురింషవద్దనీ ఆ తరువాత నెలలో ఒక ఉత్తరం ఉత్తరాల శీర్షికలో పడింది గుర్తుంషా?" అడిగాడు జనార్ధన్.

"అవును– పోకిరీ వెధవ! ఇడియట్! డాగ్– వాడెవడో– కె.కిషన్ రావు, న్యూనల్లకుంట అని రాశాడు–"

జనార్ధన్ తలవంచుకున్నాడు.

"అది రాషింది నేనే రాజేశ్వరిగారూ. ఆ కే.కిషన్‌రావ్ పేరుతో రాసింది నేనే!"

జనమంతా ఉలిక్కిపడ్డారు.

"మీరా?" అంది రాజేశ్వరి.

"అవును– అదే మీకు చేసిన దో– ద్రోహం! షమించాననండి"

"నా కథలను విమర్శించే వాళ్ళను ఛస్తే క్షమించను–" బిగుసుకుపోయిందామె.

ఆ మాటతో జనార్ధన్ భోరున ఏడవటం మొదలుపెట్టాడు."నాకు నిష్క్రషి లేదు. నిష్క్రతి లేషు!"

అందరం కలసి ఆమెను పక్కకు తీసుకెళ్ళి బ్రతిమాలాము.

"చూడండి! మీ కథలన్నీ క్లాస్ పాఠకులు మెచ్చుకుంటారు. జనార్థన్ లాంటి మాస్– మషాలా గాళ్ళు చెత్త అంటే మీకెందుకు! మీవన్నీ 'క్లాసిక్స్' అని మేమంతా ఎప్పట్నుంచో చెప్తున్నాం కదా!" అన్నాడు శాయిరామ్.

"సరే క్షమించాను" అందామె.

వెంటనే అందరం కలసి జనార్ధన్‌ని తీసెకెళ్ళి వాళ్ళింట్లో మంచం మీద పడేశము.

"ఏమిటో అన్నయ్యగారూ! ఆ పాడు సినిమాల్లో వేషం కోసం మద్రాస్ వెళ్ళిన దగ్గర్నుంచీ ఈ పాడు మందు అలవాటయిది. రోజూ రాత్రుళ్ళు తాగి ఇంటికొచ్చి నానా గొడవా చేస్తున్నారు–" అంది వాళ్ళావిడ కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"అవునన్నా! ఈ మనిషి కూడా గిట్లనే తయ్యారయ్యిండు! సినిమా ఏషాల్దిక్కు కెళ్ళి ఈ చెడ్డ అలవాటు జేస్కోని పైసలన్నీ ఖర్చుచేసి మమ్మల్ని చానా కష్టపెడుతుండు" అంది యాదగిరి భార్య గద్గద స్వరంతో.

"అంతేకాదు! వీళ్ళిద్దరూ కలసి మా ఆయన్తో కూడా బలవంతంగా తాగించారు మొన్న అలా తాగుతే గానీ సినిమా రచయితలవలేరు అని ఎవరో చెప్పారట!" అంది చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ భార్య అతనివంక కోపంగా చూస్తూ.

"ఆ మాట నిజమేలేవే! చాలామంది రచయితలు ఇంతకుముందే చెప్పారు నాకు" చిరాగ్గా అన్నాడు చంద్రకాంత్.

"అవును గురూ! వీళ్ళిద్దరూ మద్రాస్‌లో ఆ వెధవ సినిమాల్లో ఒక్క వేషం వేశారో లేదో తెగఫోజు కొడుతూ రోజూ బార్ కెళ్తున్నారు" అన్నాడు రంగారెడ్డి.

"వీళ్ళ సంగతి రేపు ఆలోచిద్దాంలెండి" అన్నాన్నేను నిద్రను ఇంకా సర్వనాశనం చేసుకోవటం ఇష్టం లేక.

"కాదు– ఇప్పుడే తేలాలి!" అంది పార్వతీదేవి ఖండితంగా. "మొన్న వంటింట్లో మావారు వంటలో నాకు సాయం చేస్తూ అన్నం వారుస్తూంటే కిటికీలోనుంచి చూసి పాటపాడారు ఇద్దరూ!" అందామె కసిగా.

"పాటేమిటి? ఏమని పాడారు? అడిగాడు శాయీరామ్ కుతూహలంగా.

అందమయిన జీవితమూ– అద్దాల సౌధమూ

వంటచేస్తూ బ్రతికితే వడలిపోవును

మందుకొట్టి తిరుగుతే ధన్యమైపోవును అని పాడారు. ఆ పాట విన్న తరువాతే మా ఆయన మందు కొట్టటం నేర్చుకున్నాడు–"

ఆ పాటలోని సాహిత్యం వినగానే ఆడాళ్ళందరికీ వళ్ళు మండిపోయింది.

"అయితే ఇప్పుడే తేల్చాల్సిందే" అంది సావిత్రమ్మ కూడా! పరిస్థితి చేయిదాటి పోతుందని గ్రహించి రంగారెడ్డి కల్పించుకున్నాడు.

"ఆ విషయం నిజమేగానీ– వాళ్ళిద్దరూ మందు ప్రభావంలో ఉన్నప్పుడు మన మాటేం వింటారు? వచ్చే ఆదివారం మీటింగ్ పెట్టుకుందాం!"

శాయిరామ్ ఆనందంతో పొంగిపోయాడు.

"సోదరసోదరీ మణులారా! అనుకోకుండా తలెత్తిన ఈ తాగుడు సమస్య గురించి వచ్చే ఆదివారం మీటింగ్ ఏర్పాటు చేస్తున్నాము. కనుక.." అంటూ జనం ఇళ్ళల్లోకి వడివడిగా వెళ్ళిపోవటం గమనించి ఉపన్యాసం ఆపేశాడు.

మర్నాడు పొద్దున్నే అందరం కలసి జనార్ధన్‌నీ యాదగిరినీ పిలిచి రాత్రి గొడవ గురించి కదిపాము.

సినిమా ఆర్టిస్టులం కదా! మాకు మందు చాలా అవసరం బ్రదర్! రాత్రిం బగళ్ళు షూటింగుల కెళ్ళటం, విశ్రాంతి ఉండక పోవటం, లైట్స్ వేడిలో నిలబడటం– మా లైఫ్ ఎవరికి తెలుస్తుంది? ఎందుకు మందుకొడుతున్నామో ఎవరర్థం చేసుకుంటారు?

అన్నాడు జనార్ధన్ శూన్యంలోకి చూస్తూ.

"అవును గురూ! మందుకొడితే గానీ వెమెరా ముందు నిలబడడానికి కాదు" అన్నాడు యాదగిరి.

"రెండు నిమిషాల వేషం వేశారో లేదో బోడి ఫోజులు! ఆ ఒక్క సినిమా కూడా విజయవాడలో ఊరిబయట హాల్లో ఒకే ఒక్క షో ఆడింది–" అన్నాడు గోపాల్రావ్.

జనార్ధన్ ఉక్రోషంగా లేచి నిలబడ్డాడు."అలా అబద్ధాలు మాట్లాడకండి! రెండో రోజు కూడా మాణింగ్ షో వేశారట."

"అయినా రాత్రి పెగ్ నెంబర్ త్రీ కొట్టాం కాబట్టి కొంచెం సరదాగా కాలనీ అంతా తిరిగాము గానీ– పెగ్ నెంబర్ టూ వరకూ అయితే ఏమీ గొడవుండదు–" అన్నాడు యాదగిరి.

"మేము రోజూ తాగేది కూడా లేదు– మనసు బాగోనప్పుడే" అన్నాడు జనార్ధన్.

ఆ రాత్రి సరిగ్గా పన్నెండికి మళ్ళా కేకలు పినిపించినయ్. కాలనీ వాళ్ళంతా కిటికీలోనుంచే టార్స్‌లైట్లు ఫోకస్ చేసి చోద్యం చూడసాగారు.

"నా కొడుకులు! ఒకేఒక్క మాణింగ్ షో ఆడిందంష! థూ దొంగ నాయాళ్ళు" అరిచాడు జనార్ధన్.

"సాలేగాళ్ళన్నా ఆళ్ళందరూ! రెండోరోజు మాణింగ్ షోలో మన యాక్షన్‌కి ఇద్దరు తప్పట్లు కొట్టిన్రట! ఆ సంగతెవళ్ళన్న చెప్తరేమో చూడు–"

ఆ తరువాత ఇద్దరూ పాట మొదలుపెటారు "జయంబు నిశ్చయంబురా భయంబు లేదురా! సినిమా ఫీల్డు కెళ్ళినోడికి ఎదురులేదురా– ఎదురు లేదురా"

మర్నాడు పొద్దున్నే మళ్ళీ వాళ్ళిద్దరినీ బయటకు పిల్చాము. "ఎప్పుడో మనసు బాగోనప్పుడే తాగుతామన్నారు కదా నిన్న" అడిగాడు రంగారెడ్డి కోపంగా.

"నిన్న మళ్ళీ మనసు పాడయిపోయిందన్నా" అన్నాడు జనార్ధన్ విచారంగా.

"ఎందుకని?"

"మా ప్రొడ్యూసర్ సెకండ్ పిక్చర్‌లో మళ్ళీ మమ్మల్ని బుక్ చేసుకుంటానన్జెప్పి– మోసం చేశాడు"

"అంటే ఇంకెవరినయినా వేసుకున్నాడా?"

"కాదు గురూ! అసలు సెకండ్ పిక్చరే తీయకుండా ఎగ్గొట్టాడు!"

"బాస్టర్డ్! బ్రీచ్ ఆఫ్ ప్రామిస్" అన్నాడు యాదగిరి కోపంగా

"అంటే ఇవాళ మీ వల్ల ఏ గొడవా ఉండదని గ్యారంటీ ఇస్తారు! అంతేనా?"

"సెంట్ పర్సెంట్" అన్నాడు జనార్ధన్.

ఆ రోజు రాత్రి హఠాత్తుగా మళ్ళీ బయట కేకలు వినిపించినయ్. అది యాదగిరి

గొంతని తెలుస్తూనే ఉంది. వెంటనే బయటకు పరుగెత్తారందరూ! అప్పటికే మిగతా చాలా మంది ఇళ్ళల్లోనుంచి బయటికొస్తూ కనిపించారు ఆ గొడవకి.

అందరం కాలనీ మధ్యలో ఆగిన ఆటోరిక్షా దగ్గరకు చేరుకున్నాం. ఆటోలో జనార్ధన్, యాదగిరి ఇద్దరూ కూర్చుని ఉన్నారు.

"ఏయ్! మేమేం ఊరోళ్ళం అనుకున్నావా? ఏయ్– మంచిగా జెప్తున్నా– మా కాలనీకి తీస్కపో! లేకుంటే నువ్వూ ఈడనే ఉంటావ్– నీ ఆటో భీ ఇక్కడనే ఉంటది!" అన్నాడు యాదగిరి.

ఆటోడ్రైవర్ మావేపు దీనంగా చూశాడు.

"ఇగో చూడండి సార్! అర్ధగంట కెళ్ళి కిరికిరి చేస్తున్రు ఈళ్ళు– నిర్భయ్‌నగర్ కాలనీ ఇదేనంటే ఇనటం లేదు–"

"వీళ్ళెక్కడ ఎక్కారు ఆటో అసలు?" అడిగాడు శాయీరామ్.

"అదేసార్– కాలనీ బయటే బార్‌లో నుంచి వచ్చి ఆటోలో కూర్చున్నారు. నిర్భయ్‌నగర్ కాలనీ వెళ్ళాలన్నారు. ఆ కాలనీ ఇదే గద్సార్. ఆటో ఎందుకు అని ఎంత మొత్తుకున్నా విన్లేదు–"

"ఏమిటి యాదగిరీ గొడవ?" అడిగాం.

"షూడు బాన్! ఆటో ఎక్కికూచున్నామో లేదో ఇదే నిర్భయ్‌నగర్ కాలనీ దిగమంటున్నాడు. తాగితే మాకు హొూష్ ఉండనుకున్నాడు!"

"అవును మరి! మన నిర్భయ్‌నగర్ కాలనీ ఇదేగదా?" అన్నాడు రంగారెడ్డి.

"ఇదిగో– మనాళ్ళయుండి ఆ ఆటో వాడిని షఫోట్ షేష్యారా! మీకు సిగ్గులేదూ? దమ్ముంటే మమ్మల్ని షపోర్టు షేయాలి!" అన్నాడు జనార్ధన్ కళ్ళు కొంచెంగా తెరచి.

"అంటే ఇది మన కాలనీ కాదంటావా?" అడిగాడు శాయిరామ్.

"ఛస్తే కాదు! మన కాలనీకి ఇంకా చాలా దూరం పోవాలి!" అన్నాడు యాదగిరి.

"ఇదేం కిరికిరి షార్– అర్ధగంట కెళ్ళి! జర మదద్ జేయండి సార్– వాళ్ళను బయటకు లాగుదాం!" అన్నాడు ఆటో అతను.

"జనార్ధన్! ఏమిటోయ్ ఇది? ఆటోదిగండి!" అన్నాడు గోపాల్రావ్.

"మేము దిగం!" అన్నాడు యాదగిరి.

"ఎందుకని?" అడిగాడు శాయీరామ్.

"ఇది మన కాలనీ కాదు–"

"కాకపోవటమేమిటి? మీ ఇల్లు కనబడటంలే?"

"నా కషలు ఇల్లేలేదు–"

యాదగిరి భార్య ఆ మాట వినడంతోనే కోపంగా ముందుకొచ్చి నిలబడింది.

"ఏందీ నీ కషలు ఇల్లే లేదా?"

"లేదు-"

"ఇప్పుడు ఇల్లు లేదంటున్నావ్, ఇంకాసేపాగుతే భార్య లేదంటావ్-"

"అవ్- నాకు భార్య గూడా లేదు-"

"ఓర్నాయనో- భార్య లేదంటున్నాడు" అంటూ గట్టిగా ఏడుపు మొదలు పెట్టిందామె.

అందరం అడ్డుపడి ఆమె ఏడుపు ఆపేశాం.

"ఇదిగో చూడవోయ్- ఇలారా ఓ సారి" ఆటోడ్రైవర్‌ని పక్కకు పిలిచాన్నేను.

"ఏమిటి సార్?"

"నువ్వో పనిచెయ్- ఆటోని కాలనీ చుట్టూ ఓ రౌండ్ కొట్టించి తీసుకురా! అప్పుడు దిగుతారేమో చూద్దాం" సలహా ఇచ్చాడు రంగారెడ్డి.

ఆటో రివ్వున కాలనీ వెనకవేపు నుంచీ రౌండ్ కొట్టి తిరిగివచ్చి మధ్యలో ఆగింది.

"ఇదే సార్ నిర్భయ్‌నగర్ కాలనీ-" అన్నాడు అతను.

"గట్ల దారికిరా! ఎంత తాగినా గానీ మా కాలనీ ఏదో తెలుసుకోలేని బేవకూఫ్‌లు గాదు మేము.." అన్నాడు యాదగిరి ఆటో దిగుతూ.

జనార్ధన్ కూడా దిగి నిలబడ్డాడు.

ఆటోవాడు హఠాత్తునా నా కాళ్ళమీదా రంగారెడ్డి కాళ్ళమీదా పడిపోయాడు.

"ఇయాళ నా ఆటోనీ, నా ఫామిలీని బ్రతికించిన్రుసార్ - లేకుంటే ఈడనే తెల్లారిపోతుండె."

వాళ్ళిద్దరినీ బలవంతంగా ఇళ్ళల్లోకి ఈడ్చుకెళ్ళాము. ఆ మర్నాటి నుంచీ మా కాలనీ పేరు చెప్తే ఆటోవాళ్ళు రావడానికి తిరస్కరించటం మొలుపెట్టారు. ఆటోలు, సైకిల్ రిక్షాలు అంతవరకూ నెమ్మదిగా వచ్చి అక్కడి నుంచీ మా కాలనీ దాటేవరకూ మాంచి స్పీడులో వెళ్ళిపోతున్నాయ్.

రోజూ రాత్రి పన్నెండు వరకూ వాళ్ళిద్దరూ కాలనీ అంతా తిరుగుతూ అందరినీ నిద్రలేపుతూ, పాటలు పాడుతూ నానాగొడవా చేసేయటం మామూలయిపోయింది.

శనివారం రాత్రి వాళ్ళతోపాటు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ కూడా చేరి గట్టిగా పాటలు పాడడం ప్రారంభించేసరికి కాలనీలో ఆడాళ్ళందరికీ భయం పెరిగిపోయింది.

రోజుకో మగాడు చొప్పున వెళ్ళి ఆ గ్యాంగ్‌లో చేరిపోతాడేమో అన్న అనుమానం వచ్చేసింది. అందుకే మర్నాడు శాయిరామ్ ఏర్పాటు చేసిన మీటింగ్‌కు మగాళ్ళ కంటే ఆడాళ్ళే ఎక్కువమంది వచ్చారు.

"ఇదంతా పెగ్ నెంబర్ త్రీ వల్లే వస్తోంది!" అంది రాజేశ్వరి మైక్‌ముందు నిలబడి. "వీళ్ళ మందుకి సంబందించిన విషయాలన్నీ నేను సేకరించాను- చాలా బార్స్‌లో!

వీళ్ళ కెపాసిటీ ఏమిటంటే రెండు పెగ్గుల వరకూ ఎలాంటి సమస్యా ఉండదు. కానీ పెగ్‌నెంబర్–త్రీ కొట్టగానే అమాయకులయిన మనలాంటి ప్రజలమీద పడి చిత్రవధ చేసేస్తున్నారు. కనుక పెగ్‌నెంబర్ త్రీ కొట్టకుండా వాళ్ళకు అడ్డుపడదాం మనం!" అందామె. అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్.

"అయితే వాళ్ళకు మూడోపెగ్ మాత్రం ఇవ్వకుండా నాలగూ అయిదూ ఎన్నయినా ఇవ్వమని బార్ వాళ్లకు చెప్తేసరి!"అంది పార్వతీదేవి.

మేమందరం నవ్వాం ఆ సలహాకు! ఎందుకు నవ్వారని పార్వతీదేవి తరిచి తరిచి అడిగింది గానీ మేము చెప్పలేదు.

"వీళ్ళను మందు జోలికి పోకుండా చేయాలంటే ఒక అయిడియా ఉంది!" అంది రాజేశ్వరి.

"ఏమిటది?" ఆత్రుతగా అడిగారు జనార్ధన్ భార్య, యాదగిరి భార్య.

"హిప్నటైజ్ చేయటం! తాగుడంటే అలర్జీ కలిగేటట్లు హిప్నటైజ్ చేయిస్తే చాలు! ఇంక జన్మలో తాగరు."

"అద్భుతం – అద్భుతం!" అంటూ తప్పట్లు కొట్టింది చంద్రకాంత్ భార్య.

"ఇంకోమందు కూడా ఉంది" అన్నాడు రంగారెడ్డి.

"ఇసూల్‌ఫిరామ్ అంటే (యాంటాబ్యూష్) టాబ్‌లెట్లు వాడితే వాళ్ళకు ఆ తాగుడు సీసాలు చూస్తే చాలు భయం పట్టుకుంటుంది."

అందరూ తప్పట్లు కొట్టారు మళ్ళీ.

మా కాలనీలోనే ఉన్న వివిన్‌పాల్ ఆ మధ్య ఆరుగంటల్లో హిప్నాటిజం క్రాష్ కోర్స్ నేర్చుకున్న విషయం మాకు గుర్తుకొచ్చింది. ఆ పనికి అతనినే నియోగించాము.

మర్నాడు రంగారెడ్డి డిసూల్ ఫిరామ్ టాబ్‌లెట్లు రెండొందలు తెచ్చి జనార్ధన్ భార్యకూ, యాదగిరి భార్యకూ ఇచ్చాడు.

"రోజుకి రెండుచొప్పున– వాళ్ళకు తెలీకుండా మంచినీళ్ళల్లో వేసి తాగించండి" అంటూ సలహా ఇచ్చాడు.

ఆరోజు సాయంత్రమే వివిన్‌పాల్ హిప్నాటిజం ప్రారంభించాడు.

యదగిరి ఇంట్లోనే అందరం గుమి కూడాము.

"మీరిద్దరూ నావంకే చూస్తున్నారు" అన్నాడు వివిన్‌పాల్.

"అవును చూస్తున్నాం" అన్నారు వాళ్ళిద్దరూ.

"నా కళ్ళల్లోకే చూస్తున్నారు–"

"అవును చూస్తున్నాం–"

"మీరిప్పుడు నిద్రావస్థలోకి వెళ్లిపోతున్నారు. మీ కళ్ళు మూతలుపడి పోతున్నాయ్.

మీ మనస్సు ప్రశాంతంగా ఉంది. మీరు రెక్కలొచ్చిన పక్షుల్లా ఎక్కడికో, ఏ లోకాల్లోకో ఎగిరిపోతున్నారు. నా గొంతు తప్పితే ఇంక మీకు ప్రపంచంలో ఏమీ వినిపించడంలేదు..."

"అన్నీ వినబడుతున్నాయ్" అన్నాడు జనార్థన్.

"వినబడుతున్నా ఆ సంగతి బయటకు చెప్పకూడదు" కోపంగా అరిచాడు పాల్.

"మీరిప్పుడు ప్రగాఢమయిన, ప్రశాంతమయిన, పవిత్రమయిన, ప్రక్షాళనమయిన స్థితిలో కెళ్ళిపోయారు– ఛస్తే బయటకు రాలేరు! వస్తే చచ్చారే! ఇప్పుడు మీకు నేనేది ఇచ్చినా మజ్జిగలాగానే కనబడుతుంది! మీరేం తాగినా మజ్జిగలాగానే కనబడుతుంది. ఇల్లంతా మజ్జిగమయం! బార్ అంతా మజ్జిగ మయం! ప్రపంచమంతా మజ్జిగ మయం!" అంటూ ఆపి యాదగిరి భార్యకుసైగ చేశాడు పాల్.

ఆమె వెంటనే రెండు గ్లాసుల్నిండా బ్రాందీ పోసుకొచ్చి వాళ్ళిద్దరి ముందూ చెరో గ్లాసూ పెట్టింది.

"ఇప్పుడు మీరు మీ ముందు గ్లాసుల్లో ఉన్న మజ్జిగ తాగుతారు!" అన్నాడు పాల్.

"మజ్జిగా?"

"అవును తాగండి–"

"వద్దు! మజ్జిగంటే మాకు అలర్జీ!" గ్లాసులు విసిరికొడుతూ అన్నారు వాళ్ళు అందరం పాల్‌ని కౌగిలించుకున్నాం. ''ఇంక నీ హిప్నాటిజంకి తిరుగులేదు'' అంటూ అభినందించాం.

"అంతే! వీళ్ళిక ఎప్పుడు బ్రాందీ తాగినా మజ్జిగలా అనిపిస్తుంది. కనుక ఎప్పటికీ వీళ్ళిక మందు కొట్టరు" అన్నాడతను విజయగర్వంతో.

"ఫెంటాస్టిక్! ఈ వార్త మా పేపర్లో వేసేస్తాను" అన్నాడు గోపాల్రావ్.

"ఇంక మీరిప్పుడు నార్మల్ ప్రపంచంలో కొచ్చేస్తారు. అయితే బ్రాందీ విస్కీల్లాంటివి ఏం తాగినా మీకు పుల్లని మజ్జిగ తాగినట్లే అనిపిస్తుంది–" అన్నాడు పాల్.

వాళ్ళిద్దరూ మామూలు ప్రపంచంలో కొచ్చేశారు.

వెంటనే టాబ్‌లెట్లు కలిపిన మంచినీళ్ళు ఇద్దరికీ ఇచ్చేసింది జనార్ధన్ భార్య.

అది తాగ్గానే మమ్మల్ని చూచి 'కెవ్వ'మని అరచారిద్దరూ.

"ఏమిటలా అరచారు?" అడిగాడు రంగారెడ్డి.

"భయం వేసింది ఎందుకో!" భయంగా చెప్పారు వాళ్ళు.

రంగారెడ్డి గర్వంగా మా అందరివేపూ చూశాడు.

ఆ సాయంత్రం వాళ్ళిద్దరూ మళ్ళీ బార్ కెళ్తోంటే నేను రహస్యంగా వాళ్ళను వెంబడించి వాళ్ళకి తెలీకుండా ఆ పక్క రూమ్‌లోనే కూర్చున్నాను.

"పిచ్చి సన్యాసులు– మనం నిజంగానే హిప్నటైజ్ అయిపోయా మనుకున్నారు–"

అన్నాడు జనార్ధన్. నేను షాకయ్యాను.

ఇద్దరూ పగలబడి నవ్వుకున్నారు కాసేపు.

'ఆ టాబ్లెట్స్ కలిపిన మంచినీళ్ళు తాగ్గానే మనకు నిజంగానే భయం వేసిందని కూడా భలే బోల్తాపడ్డారు–"

మళ్ళీ నవ్వుకున్నారిద్దరూ.

బేరర్ బాటిల్ తీసుకెళ్ళి వాళ్ళ ముందున్న గ్లాసుల్లో మందు పోయటం నాకు కనబడుతూనే ఉంది.

రెండు నిముషాలే నిశ్శబ్దంగా ఉన్నారిద్దరూ.

"ఇదేదో మజ్జిగ వాసన వేస్తోందేమిటి?" అన్నాడు జనార్ధన్.

"అవునన్నా! నేనూ అదే చెప్దామనుకుంటున్న నీతో–" అన్నాడు యాదగిరి.

జనార్ధన్ బేరర్‌ని పిలచాడు.

"యస్సార్"

"బ్రాంది అదోలా ఉందేమిటివాళ?"

"అదేబ్రాండ్ కద్సార్ తెచ్చింది?"

"అఫ్‌కోర్స్ బ్రాండ్ అదేననుకో– ఇంకే కస్టమరూ దీన్ని గురించి ఏమీ చెప్పలేదా?"

"చివరి కాబిన్లో కూర్చున్నాయన చెప్పారు సార్!"

"ఏమని?"

"ఈసారి స్టాక్ చాలామంచి స్టఫ్‌తో వచ్చిందని–"

"ఐసీ– సరే– నువ్వెళ్ళు"

మళ్ళీ అయిదు నిమిషాల నిశ్శబ్దం.

"నేను తాగలేనుగురూ! నా కింకా మజ్జిగవాసనే కొడుతోంది." అన్నాడు జనార్ధన్?

"నాకూ అంతే!"

"వదిలేసి వెళ్లిపోదామా?"

"వాంతులు చేసుకోవటం కన్నా అదే మంచిది గదా!"

"ఒకవేళ– బై ఛాన్స్– జస్ట్‌ఫర్ అవర్ సేక్– ఆ పాల్‌గాడి హిప్నాటిజం ఏమయినా వర్క్ చేసిందంటావా?"

"ఏమోగురూ! నాకేం సమజ్ కావటం లేదు–"

"సరే–పద! రేపు చూద్దాం!"

వారం రోజులు గడిచిపోయింది. ఇప్పుడు జనార్దన్, యాదగిరి నిజంగానే భయం భయంగా చూస్తున్నారు మా అందరివంకా! జనార్ధన్ రాత్రుళ్ళు తన నీడనే చూచుకుని కెవ్వున అరుస్తున్నాడని వాళ్ళావిడ చెప్పింది.

చివరకు వాళ్ళిద్దరూ మందు మానేశారు. కాలనీవాళ్ళందరం కలసి పాల్‌కి వెయ్యిరూపాయల పర్స్ బహూకరించాం!

ఆ మర్నాడే పాల్ ఆ వెయ్యి రూపాయలూ బార్‌లో జనార్దన్‌కీ, యాదగిరికీ డ్రింక్స్ సర్వ్ చేసిన బేరర్‌కి ఇస్తూంటే నేనూ రంగారెడ్డి, శాయీరామ్ చూడటం తటస్థించింది.

వెనుకనుంచి వెళ్ళి పాల్ భుజం మీద చెయ్యి వేశాము.

గాల్లోకి ఎగిరిపడ్డాడు పాల్.

"మీరా!" అన్నాడు పాలిపోయిన మొఖంతో.

"సంగతేమిటి?" అడిగాడు శాయిరామ్.

ఆ బేరర్ నిజంగానే బ్రాందీలో బటర్ మిల్క్ కలిపి ఇచ్చాడు వాళ్ళకు– అందుగ్గాను నేను వెయ్యి రూపాయలు అతనికివ్వాలని ఒప్పందం!"

"అయితే ఇది నీ హిప్నాటిజం ప్రభావం కాదన్నమాట!"

"ఎందుకో అది పనిచేయలేదు గురూ! నాకు నేర్పించినవాడిని వదలన్లే– ఎప్పుడో పట్టుకుని తుక్కు రేగ్గొట్టేస్తాను–"

అందరం నవ్వేశాము.

"కాని గురూ! దయచేసి ఈ విషయం ఎవరికీ చెప్పకండి నా ప్రిస్టేజ్ పోతుంది." బ్రతిమాలసాగాడు పాల్.

"సరే!" అన్నాం అయిష్టంగానే.

చాలా రోజుల తర్వాత మళ్ళీ ఆరోజు అందరం ఉదయం పదిగంటల వరకూ సుఖంగా నిద్రపోవాలని నిర్ణయించుకున్నాము.

కానీ ఉదయం ఆరయేసరికి బయట పెద్ద కోలాహలం వినిపించేసరికి కాలనీని తిట్టుకుంటూ బయటకు వెళ్ళక తప్పలేదు నాకు.

అక్కడి దృశ్యం చూస్తూనే నిద్రమత్తంతా వదిలిపోయింది.

పాల్ ఇంటిముందు కొన్ని వేలమంది స్త్రీలు క్యూ కట్టి నిలబడి ఉన్నారు.